# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 8, ఆగస్టు 2026




### ఆగస్టు 15న సీఎం చేతుల మీదుగా

# 1.06 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

★ పంట మార్పిడితో రైతులకు నష్టం లేదు: మంత్రి తుమ్మల

★ వన మహోత్సవ లక్ష్యాలు గడువులోగా పూర్తి చేయాలి: సీఎస్‌ని

**నిర్మల్, ఆగస్టు 07, ప్రభాతవార్త:**



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా 1 కోటి 6 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. జిల్లాల్లో పంపిణీ ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయంగా వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షపాతం, జలాశయాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికలు అమలు చేయాలన్నారు. పంట మార్పిడి విధానాల అమలు ద్వారా రైతులు నష్టాలను నివారించడంతో పాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు పంటల వైవిధ్యంపై అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన పంట కుంటల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశాలు నిర్వహించి, రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, సాగు మిగతా 2లో..

# వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

❁ రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి

**నస్పూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త**




జనగణన–2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి అవసరమైన గ్రామ డైరెక్టరీ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జన గణన సంచాలకులు మాట్లాడుతూ భారత ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర జనగణన సంచాలకుల కార్యాలయం మార్గదర్శకాల మేరకు జిల్లాల పరిధిలో అన్ని చార్జ్‌ల పరిధిలో ఫీల్డ్ ఫంక్షనరీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణల ద్వారా సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఏకరూపత, ఖచ్చితత్వం, నాణ్యతను నిర్ధారించేందుకు సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్ సేవలు, పోస్టల్ సేవలు, వ్యవసాయం, మార్కెటింగ్ సౌకర్యాలు, సామాజిక, ఆర్థిక మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసే విధానంపై క్షేత్ర సిబ్బందికి తగు శిక్షణ అందించాలని తెలిపారు. చార్జ్ అధికారులు తమ పరిధిలోని ఫీల్డ్ ఫంక్షనరీలకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడంతో పాటు, వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతి గ్రామం, పట్టణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. నమోదయ్యే ప్రతి సమాచారం సంపూర్ణంగా, ఖచ్చితంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. హ్యాండ్ బుక్ పార్ట్–ఎ లో గ్రామ, పట్టణ డైరెక్టరీలు, పార్ట్ బి లో ప్రాథమిక గణన సారాంశం ఉంటాయని తెలిపారు. మొబైల్ యాప్, వెబ్ పోర్టల్, అవసరమైతే భౌతిక షెడ్యూల్ ద్వారా సమాచార సేకరణ జరుగుతుందని తెలిపారు. ఛార్జ్ అధికారుల బాధ్యతలు, మిగతా 2లో..

# ప్రీప్రైమరీ విద్యను మరింత బలోపేతం చేయాలి

**కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7, ప్రభాతవార్త :**



ప్రి ప్రైమరీ విద్యను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ హరిత ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ప్రారంభమైన ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హరిత పాల్గొని మాట్లాడారు. ప్రి ప్రైమరి పాఠశాలలు చిన్నారుల తొలి విద్యాభ్యాస దశ అని, వారి భవిష్యత్ విద్యకు పునాది వంటిదని అన్నారు. ప్రీప్రైమరీ దశలో పిల్లలపై చదువు ఒత్తిడి లేకుండా, ఆటలు, పాటలు, మిగతా 2లో..

### కర్ణాటకలో బంగారం, రాగి అన్వేషణకు

# సింగరేణి కీలక ఒప్పందం

❖ దేవదుర్గ బ్లాక్‌లో 199.13 చదరపు కిలోమీటర్ల పరిధిలో అన్వేషణ

❖ కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖతో ఒప్పంద పత్రాలపై సంతకాలు



**నస్పూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, యాదగిరి జిల్లాల్లో విస్తరించి ఉన్న దేవదుర్గ బ్లాక్‌లో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు కీలక ఒప్పందం కుదుర్చుకుంది. గతంలో కేంద్ర ప్రభుత్వ వేలంలో లైసెన్స్ పొందిన సింగరేణి, అన్వేషణ పనులు ప్రారంభించేందుకు కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖతో ఒప్పందం చేసుకుంది. బెంగళూరులోని డీఎంజీ కార్యాలయంలో కర్ణాటక డీఎంజీ డైరెక్టర్ రంగప్ప, సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం దేవదుర్గ ప్రాంతంలోని 199.13 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఐదేళ్లలోపు అన్వేషణ పూర్తి చేయడానికి అంగీకారం కుదిరిందని వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే అధికారులను నియమించామని, త్వరలో మరికొంతమంది సిబ్బందిని నియమించి రెండేళ్లలోపు జీ4 అన్వేషణను విజయవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రంలో ఈ స్థాయిలో ఖనిజ అన్వేషణ చేపట్టడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారని, 13 దశాబ్దాల అనుభవంతో ఈ ప్రాజెక్టును విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్వేషణలో భాగంగా రిమోట్ సెన్సింగ్, జియోలాజికల్ మ్యాపింగ్, జియోఫిజికల్ సర్వేలు నిర్వహించి స్కౌట్ డ్రిల్లింగ్ చేపడతారు. సేకరించిన నమూనాల విశ్లేషణను కొత్తగూడెంలోని సింగరేణి జియోసైన్స్ ల్యాబొరేటరీలో చేపట్టి, నివేదికను కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖకు సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, డీజీఎం రాజేశ్వర్, డీవైఎఫ్ఎం లక్ష్మీప్రియ, సీనియర్ లా ఆఫీసర్ ప్రభందిత తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు జనన ధృవీకరణ పత్రం జారీ చేసిన పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

**సిర్పూర్ (టి), ఆగస్టు 7, ప్రభాతవార్త :**

జిల్లాలోని సిర్పూర్ (టి) మండలం సిర్పూర్ (టి) గ్రామపంచాయతీలో తప్పుడు జనన ధృవీకరణ పత్రం జారీ చేసినట్లు నిర్ధారణ కావడంతో పంచాయితీ కార్యదర్శి సస్పెండ్ చేస్తూ కంప్యూటర్ ఆపరేటర్ ను విధుల నుండి తొలగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో జనన మరణాల నమోదు చట్టం, 1969 నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి విధి నిర్వహణలో తీవ్ర నిరక్ష్యం ప్రదర్శించినట్లు నిర్ధారణ అయిందని, విచారణ నివేదిక ప్రకారం సంబంధిత వ్యక్తి పొన్నం శ్రీనిధికి సంబంధించిన జనన తేదీ రిజిస్టర్‌లో నమోదు లేకపోవడం, దరఖాస్తు స్వీకరించకపోవడం, అవసరమైన ఎటువంటి ఆధార పత్రాలను పరిశీలించకపోవడం జరిగినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నేరుగా యూనిఫైడ్ బర్త్ అండ్ డెత్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి జనన ధృవీకరణ పత్రాన్ని జారీ చేసినట్లు విచారణలో తేలిందని వివరించారు. విధి నిర్వహణలో తీవ్ర నిరక్ష్యం, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శి తిరుపతిని తక్షణమే సస్పెండ్ చేస్తూ, తదుపరి శాఖాపరమైన మిగతా 2లో..



# వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఫీల్డ్ సిబ్బంది నియామకం, యూజర్ ఐడీల సృష్టి, శిక్షణ నిర్వహణ, ఫీల్డ్ వర్క్ పర్యవేక్షణ, డేటా ధృవీకరణ, గౌరవ వేతనాల పంపిణీ, నిర్ణీత గడువులో పనుల పూర్తి వంటి అంశాలు పొందుపరచబడి ఉంటాయని, డేటా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ/పట్టణ కోడ్ల సక్రమంగా నమోదు చేయాలని, తప్పనిసరి వివరాలన్నీ నమోదు చేయాలని, డూప్లికేట్ సమాచారం లేకుండా సంబంధిత శాఖల రికార్డులతో సరిపోలే విధంగా సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. డేటా భద్రత పరంగా యూజర్ ఐడి, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని, అధికారిక యాప్, పోర్టల్ మాత్రమే ఉపయోగించాలని, అధికారిక సమాచారాన్ని సోషల్ మీడియా / వ్యక్తిగత మెసేజింగ్ ద్వారా పంచరాదని, పని పూర్తయిన వెంటనే లాగ్ అవుట్ చేయాలని తెలిపారు. అలాగే ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం సహాయ వ్యవస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మొహమ్మద్ విలాయత్ అలీ, సంబంధిత అధికారులు హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన హ్యాండ్‌బుక్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, విధాన నిర్ణయాలు, పరిశోధనలకు ప్రామాణిక సమాచార గ్రంథంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన అన్ని చార్జ్ అధికారులు, ఫీల్డ్ ఫంక్షనరీలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, సమాచార సేకరణ, వెబ్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాకు సంబంధించిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులపై సమగ్ర సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, భవిష్యత్ ప్రణాళికాబద్ధ అభివృద్ధికి బలమైన పునాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేంద్ర రాథోడ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, ముఖ్య ప్రణాళిక అధికారి, ఉప గణాంక అధికారి రాజేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రీప్రైమరీ విద్యను మరింత బలోపేతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కథలు, సంభాషణలు, చిత్రలేఖనం, వివిధ కార్యకలాపాల ద్వారా నేర్చుకునే అవకాశాలను కల్పించాలన్నారు. పిల్లలు పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపేలా సురక్షితమైన, సంతోషకరమైన, ఆహ్లాదకరమైన అభ్యసన వాతావరణాన్ని ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి చిన్నారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారి వయస్సు, ఆసక్తి, అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధనా కార్యక్రమాలను రూపొందించాలని తెలిపారు. ప్రీప్రైమరీ విద్యలో కు బలమైన పునాది వేయడం అత్యంత ముఖ్యమని, ఈ దశలో పిల్లల్లో భాషా నైపుణ్యాలు, సంఖ్యా భావనలు, పరిశీలన, ఆలోచన, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని అన్నారు. పిల్లల భద్రత, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గది వాతావరణం వంటి అంశాలకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఒక చిన్నారి పాఠశాలలో పొందే తొలి అనుభవం ఆ పిల్లవాడి మొత్తం విద్యా ప్రయాణంపై ప్రభావం చూపుతుందని, అందువల్ల ప్రీ ప్రైమరీ తరగతి గదిని పిల్లలు ప్రతిరోజూ ఆనందంగా రావాలనుకునే ప్రదేశంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ మహేశ్వర్ , రిసోర్స్ పర్సన్లు శంకర్, యూనిస్,వెంకటేష్, ప్రీప్రైమరీ సెక్షన్లు నిర్వహిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15న సీఎం చేతుల మీదుగా

# 1.06 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రణాళికలపై స్పష్టమైన సమాచారం అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు విస్తృతంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.అనంతరం జిల్లాల వారీగా వర్షపాతం, పంటల సాగు, నీటి లభ్యత తదితర అంశాలను మంత్రులు సమీక్షించారు.కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని, వన మహోత్సవ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్ఓ రాథోడ్ రమేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, డీఈఓ భోజన్న, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు జనన ధృవీకరణ పత్రం జారీ చేసిన పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

(మొదటిపేజీ తరువాయి)

క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. తప్పుడు నమోదు ప్రక్రియలో బాధ్యత వహించిన కంప్యూటర్ ఆపరేటర్ నీలేష్‌ను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన, తప్పుడు ధృవీకరణ పత్రాల జారీ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, గ్రామపంచాయతీలలో ప్రజలకు అందించే సేవలు పూర్తిగా పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలని, ప్రతి దరఖాస్తును సంబంధిత ఆధారాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే పరిష్కరించాలని తెలిపారు.

# ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే గొప్ప సేవ

**- కోనేరు నిత్య అన్నదాన సత్రంలో ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ బస్టాండ్ ఎదురుగా గత ఏడు సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న కోనేరు నిత్య అన్నదాన సత్రంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. సత్రంలో భోజనం చేసేందుకు వచ్చిన ప్రజలతో ఆయన నేరుగా మాట్లాడి అక్కడ అందిస్తున్న భోజనం రుచి, నాణ్యత, వసతులు, నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.

### ప్రజలతో నేరుగా మాట్లాడి వివరాల సేకరణ..

అన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న వారిని పలకరించిన కోనప్ప.. భోజనం నాణ్యత, రుచి, సమయపాలన తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు అందిస్తున్న సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. సత్రం ద్వారా అందిస్తున్న సేవలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### ప్రజాసేవే ప్రధాన కర్తవ్యం..

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ.. తనను మూడు సార్లు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు తాను ఎంత చేసినా, ఎంత ఇచ్చినా తక్కువేనని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేయడమే తన కర్తవ్యమని పేర్కొన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని అన్నారు.గత ఏడు సంవత్సరాలుగా కోనేరు నిత్య అన్నదాన సత్రం ద్వారా నిరంతరం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించడం ఎంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన భోజనం అందేలా సత్రం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులకు సూచించారు. అన్నదాన సత్రం సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# రైతులకు రాయితీపై కంది విత్తనాల పంపిణీ

**- రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ఏఓ రామకృష్ణ**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలంలోని రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ కంది విత్తనాలను మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఆత్మనిర్భర్ పప్పుధాన్యాల సాగు కార్యక్రమం కింద 23 శాతం రాయితీపై కంది విత్తనాలను రైతులకు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు కాగజ్‌నగర్ వ్యవసాయ కార్యాలయానికి 20 క్వింటాళ్ల కంది విత్తనాలు అందినట్లు ఆయన వెల్లడించారు. రైతులకు 4 కిలోల చొప్పున విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కంది విత్తనాల 4 కిలోల ప్యాకెట్ అసలు ధర రూ.520 కాగా, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రూ.120గా ఉందని అధికారులు తెలిపారు. దీంతో రైతు చెల్లించాల్సిన మొత్తం రూ.400 మాత్రమేనని పేర్కొన్నారు. కంది విత్తనాలు అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ తీసుకుని వ్యవసాయ కార్యాలయానికి రావాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. అర్హత మేరకు రాయితీపై విత్తనాలను పొందాలని కోరారు. కంది సాగు, విత్తనాల వినియోగం, పంట యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని రామకృష్ణ సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సాగు సలహాలను వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రెహమాన్, రైతులు పాల్గొన్నారు.

## రైతు బలోపేతమే అభివృద్ధికి పునాది

### - భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావ్ పాటిల్

**భైంసా, ఆగస్టు 07, ప్రభాతవార్త:**



నిర్మల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కమిషన్ సమావేశంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ ఆనంద్ రావ్ పాటిల్ పాల్గొన్నారు. తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలో వ్యవసాయాభివృద్ధి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహం, పంటల మార్కెటింగ్, రైతు సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆనంద్ రావ్ పాటిల్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే దిశగా పలు సూచనలు చేశామన్నారు. రైతు బలోపేతమే రాష్ట్ర అభివృద్ధికి అసలైన పునాది అని ఆయన పేర్కొన్నారు.



## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్

**బజార్‌హత్నూర్, ఆగస్టు 07, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రముఖులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో ముందుకెళ్తామన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## వింధ్య పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు

**సారంగాపూర్, ఆగస్టు 07, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని వింధ్య పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రమేష్, ప్రిన్సిపల్ కే. నవీన్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీరామ్ శ్రీనివాస్, సాయినాథ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీలత, పల్లవి, సుమన్య, లావణ్య, సంధ్యారాణి, స్రవంతి, సులోచన, గౌతమి, దివ్య, సౌజన్య, పావని, ప్రేరణ, శరణ్య, లావణ్య, జ్యోతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పోడు భూముల వివాదంలో సంయమనం పాటించాలి

### గ్రామస్తులు, అధికారులతో కలెక్టర్ భవేశ్ మిశ్రా సమావేశం - సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం: కలెక్టర్

**నిర్మల్, ఆగస్టు 07, ప్రభాతవార్త:**



కడెం మండలం ఉడుంపూర్ గ్రామంలోని పోడు భూముల వివాదం నేపథ్యంలో అటవీ అధికారులు, గ్రామస్తులు సంయమనం పాటించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, జిల్లా పరిపాలన పూర్తి స్థాయిలో సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉడుంపూర్ గ్రామస్తులు, అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోడు భూముల రైతులు, అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ విడివిడిగా చర్చించి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అందరూ సహకరించాలని కోరారు. గ్రామస్తులు శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఉడుంపూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ అన్నాభావు సాటే జయంతి

### జాతీయ జెండా ఆవిష్కరణ, నివాళులర్పించిన సర్పంచ్, నాయకులు

**భైంసా, ఆగస్టు 07, ప్రభాతవార్త:**



తానూర్ మండలం కోలూరు గ్రామంలో ప్రజాకవి, సామాజిక సంస్కర్త డాక్టర్ అన్నాభావు సాటే 106వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ మాధవ్ పటేల్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ భలేరావు, రిటైర్డ్ ఫారెస్ట్ అధికారి గైక్వాడ్ గంగాధర్, కొత్తూరు శంకర్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు హాజరై అన్నాభావు సాటే సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అన్నాభావు సాటే తన రచనల ద్వారా అణగారిన వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన గొప్ప ప్రజాకవి అని కొనియాడారు. సమానత్వ సందేశాన్ని అందించిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సామాజిక న్యాయం, సోదరభావం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో అన్నాభావు సాటే కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బి.పి. మండల్ ఆశయాలే బీసీలకు మార్గదర్శకం

### - తెలంగాణ బీసీ హక్కుల నేత సుంకేట పోశెట్టి

**భైంసా, ప్రభాతవార్త:**



బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో 1978లో అప్పటి కేంద్ర ప్రభుత్వం బిందేశ్వరి ప్రసాద్ (బి.పి.) మండల్ చైర్మన్‌గా కమిషన్‌ను నియమించిందని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకేట పోశెట్టి తెలిపారు. భైంసా పట్టణంలోని తన నివాసంలో బి.పి. మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుంకేట పోశెట్టి మాట్లాడుతూ.. 1980లో నివేదిక అందించిన మండల్ కమిషన్ దేశంలో 52 శాతం ఉన్న బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని సూచించిందన్నారు. 1990 ఆగస్టు 7న నాటి ప్రధాని వి.పి. సింగ్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. అందుకే ఈ రోజును దేశవ్యాప్తంగా బీసీలు బి.పి. మండల్ దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బీసీల హక్కుల కోసం తన ప్రధాని పదవినే త్యాగం చేసిన మహానీయుడు వి.పి. సింగ్ అని కొనియాడారు. మండల్ నివేదికను పూర్తిస్థాయిలో అమలు చేసి, బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం 52 శాతం రిజర్వేషన్లు దక్కేలా కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి తేలాలని డిమాండ్ చేశారు.

# ఎన్జీఓ అధ్యక్షుడిని పరామర్శించిన పత్తిరెడ్డి

**సారంగాపూర్, ఆగస్టు 07, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాస్త్రినగర్‌కు చెందిన రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. విషయం తెలుసుకున్న సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం శాస్త్రి నగర్‌లోని లింగన్న నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా లింగన్న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న రాజేశ్వర్‌రెడ్డి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సారంగాపూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ రాజేశ్వర్, నాయకులు సంతోష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాకేపల్లి సురేందర్ తదితరులు ఉన్నారు.

# సింగరేణిలో 300 మందికి అప్రెంటిస్‌షిప్ అవకాశం

**- దరఖాస్తు గడువు ఆగస్టు 16 సాయంత్రం 5 గంటల వరకు**

**- అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ పిలుపు**



**నస్పూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ వ్యాప్తంగా 300 మంది అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పిస్తూ సింగరేణి హెచ్‌ఆర్‌డీ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. గడిచిన ఐదేళ్లలో (2022, 2023, 2024, 2025, 2026) ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ లేదా డిప్లొమా పూర్తయిన అభ్యర్థులు దీనికి అర్హులని పేర్కొంది. మొత్తం ఖాళీలలో 150 ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు, 100 నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు, 50 డిప్లొమా అభ్యర్థులకు కేటాయించారు. విభాగాల వారీగా వివరాలు పరిశీలిస్తే, ఇంజనీరింగ్‌లో మైనింగ్ 40, ఈఈఈ 35, మెకానికల్ 35, సివిల్ 15, ఈసీఈ 10, సీఎస్ఈ 10, ఐటీ 5 స్థానాలు ఉన్నాయి. నాన్ ఇంజనీరింగ్‌లో బీఎస్సీ 30, బీఏ 25, బీకాం 25, బీ ఫార్మసీ 6, బీబీఏ 5, బీసీఏ 5 ఖాళీలు కేటాయించారు. డిప్లొమా విభాగంలో మైనింగ్ 20, ఈఈఈ 10, మెకానికల్ 10, సివిల్ 10 చొప్పున అవకాశాలు ఉన్నాయి. ఎంపికైన ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ అభ్యర్థులకు నెలకు రూ. 12,300, డిప్లొమా అభ్యర్థులకు రూ. 10,900 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 6 నుండి ఆగస్టు 16 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు మొదట www.education.gov.in (NATS 2.0) పోర్టల్‌లో నమోదు చేసుకుని, అనంతరం సింగరేణి అప్రెంటిస్‌షిప్ పోర్టల్ www.scclmines.com/apprenticeship లో దరఖాస్తు సమర్పించాలి. ఆపై అవసరమైన ధ్రువపత్రాలతో సమీపంలోని ఏరియా ఎంవీటీసీ కేంద్రాలలో దరఖాస్తు ప్రతిని అందజేయాల్సి ఉంటుంది. ఈ ప్రాక్టికల్ నాలెడ్జ్ ద్వారా భవిష్యత్తు ఉద్యోగాలకు లబ్ధి చేకూరుతుందని, ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ కోరారు.



విన‌తిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ లావణ్య

## విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

**- 8వ వార్డులో సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ లావణ్య వినతి**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని 8వ వార్డులో అవసరమైన ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య లక్ష్మణ్ శుక్రవారం విద్యుత్ శాఖ టౌన్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. వార్డులో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు సరిపడా లేకపోవడంతో కొత్త విద్యుత్ కనెక్షన్లు పొందే ప్రజలు సర్వీస్ వైర్లను దూరం వరకు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. స్తంభాల కొరత కారణంగా కొన్ని వీధుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయలేక రాత్రివేళల్లో చీకటి నెలకొంటోందని పేర్కొన్నారు. వార్డులో విద్యుత్ స్తంభాలు అవసరమైన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి గుర్తించాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.



## ముగిసిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**చెన్నూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి, నేటితో ముగింపు చేశామని ఐసీడీఎస్ అంగ్రజ్ పల్లి సెక్టార్ సూపర్వైజర్ పద్మ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని అంగ్రాజ్ పల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బందితో కలిసి ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కర్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించామని, వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించామని తెలిపారు. పలు అంగన్వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ సర్పంచులు, పాల్గొన్నారని తెలిపారు. ముగింపు సందర్భంగా అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి, తల్లిపాల ప్రాధాన్యాన్ని ప్రతి కుటుంబానికి చేరవేశామని పేర్కొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం

**లక్షెట్టిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త**

లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. సంధ్యారాణి డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా పొందారు. ఆమె శ్రీ కృష్ణ యూనివర్సిటీ, మధ్యప్రదేశ్ విశ్వవిద్యాలయం నుంచి రాజనీతి శాస్త్రం విభాగం లో డాక్టరేట్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. డా. విజయ్ కుమార్ చతుర్వేది పర్యవేక్షణలో ఆమె ఖగతూర్పు, పశ్చిమ తెలంగాణ రాజకీయ పార్టీలలో మహిళా సాధికారతపై ఒక అధ్యయనంగ్గ అనే అంశంపై పరిశోధన నిర్వహించి పీహెచ్.డి. పట్టా అందుకున్నారు. సమకాలీన సామాజికరాజకీయ పరిస్థితుల్లో మహిళల రాజకీయ భాగస్వామ్యం, సాధికారత, రాజకీయ పార్టీలలో వారి పాత్ర వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషిస్తూ చేసిన ఈ పరిశోధన విద్యా, సామాజిక వర్గాల ప్రశంసలు అందుకుంటోంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మహాత్మ సంతోష్, అధ్యాపకులు, సహచర సిబ్బంది, విద్యార్థులు, పలువురు ప్రముఖులు డా. కె. సంధ్యారాణిని అభినందిస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని విద్యా పరిశోధనలు చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## నేటి నుంచి కడెం ఆయకట్టు నీరు విడుదల

**- ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం**

**- మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు**

**లక్షెట్టిపేట, ఆగస్టు 07, ప్రభాతవార్త**



నేటి నుండి కడెం ఆయకట్టు పరిధిలోని మూడు మండలాలకు చెందిన రైతులకు నీటిని విడుదల చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రోజు మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా గత రెండు మూడు రోజుల నుంచి మంత్రులతో చర్చించి కడెం ఆయకట్టు పరిధిలోని మూడు మండలాలకు చెందిన రైతులకు శనివారం నుండి నీరు అందించేలాగా కృషి చేశారు. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఆధారాలు లేవని, ఇలాంటి విమర్శలు మానుకుంటే మంచిదని, లేదంటే రాబోయే రోజుల్లో ప్రజలే తీర్పిస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రైతుల అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ రాజేష్, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, డైరెక్టర్లు, మున్సిపాలిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్ భరో విజయవంతం చేయాలి

**- నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్**

**మంచిర్యాల, ఆగస్టు 7, ప్రభాతవార్త**



ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మెడికల్ సేల్స్ అండ్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని, బ్యాంకులు, రైల్వేలు, తపాలా, టెలికాం, సింగరేణి, విమానయాన తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించరాదని డిమాండ్ చేశారు. ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, మందులపై విధించిన భారాలను తొలగించాలని కోరారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జరిగే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సాగర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సంతోష్, జిల్లా అధ్యక్షుడు కుమార్, రామకృష్ణ, రాకేష్, చారి, వెంకటేష్, వెంకటేష్ గౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవికుమార్

## పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి

**- మాదారం3 ఇంక్లైన్ సర్పంచ్ చందనాల రవికుమార్**

**తాండూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని మాదారం3 ఇంక్లైన్ సర్పంచ్ చందనాల రవికుమార్ అన్నారు. మండలంలోని మాదారం3 ఇంక్లైన్లో శుక్రవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విబిజి రాంజీ ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్, వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామసభలో అభివృద్ధి పనులకు తీర్మానం

**తాండూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని పోచంపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ కుశలపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో గ్రామపంచాయతీ పరిధిలోని సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి పలు అభివృద్ధి పనులకు పనులకు తీర్మానం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలలో భాగంగా గ్రామాల్లోని సమస్యలకు పరిష్కారం కోసం ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, గోదల లక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ శ్రీవాణి, ఏఎన్ఎం, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల ర్యాలీ

**- చెట్లను కాపాడాలి.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి - ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్ ఈకో క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :




పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, సహజ వనరుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్ ఈకో క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు సందేశాన్ని అందించారు. ప్లకార్డులు చేతబట్టి వనమహోత్సవం, అటవీ సంరక్షణ, కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపుపై నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ అటవీ కార్యాలయం వరకు కొనసాగింది. అక్కడ అటవీ శాఖ అధికారులు విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అటవీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, డీఆర్వో హేమలత, బయోలజిస్ట్ ఏలం మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత, జీవవైవిధ్య పరిరక్షణలో అడవుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. విద్యార్థులు పెద్దఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, సహజ వనరులను పొదుపుగా వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణకు అంబాసిడర్లుగా వ్యవహరించాలని కోరారు. అవగాహన ర్యాలీ నిర్వహించిన ఈకో క్లబ్, పాఠశాల యాజమాన్యాన్ని అటవీ శాఖ అధికారులు అభినందించారు. పర్యావరణ అవగాహన కార్యక్రమాలు బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపింది. ర్యాలీ ముగింపు సందర్భంగా విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడుతూ పచ్చదనంతో కూడిన ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్ సిస్టర్ ఫ్లవరి, మదర్ మెరిటా, సిస్టర్ బెట్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నీటి పారుదల శాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

## వట్టి వాగు ప్రాజెక్ట్ సాగు నీటిని విడుదల చేయాలి

ఆసిఫాబాద్, ఆగస్ట్ 7, ప్రభాతవార్త :

ఆసిఫాబాద్ మండలంలోని వట్టి వాగు ప్రాజెక్ట్ నుండి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ డిఈ కార్యాలయంలో రైతులు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షభావ పరిస్థితులతో ప్రాజెక్ట్ లో నీరు చేరడం ఆలస్యం అయిందని, ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్ లోకి పూర్తి సామర్థంతో నీరు నిండిందని అన్నారు. ఇప్పటికే రైతులు వరి నారు పోసారని, నీటిని విడుదల చేయకపోవడంతో వరి నారు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ పంట పొలాలు ఇతర ఆరుతడి పంటలకు అనుకూలంగా లేవని, అధికారులు స్పందించి ప్రాజెక్ట్ లోని నీటిని విడుదల చేస్తే రైతులు వరి పంట సాగు చేసుకుంటారని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మున్నూరు కాపు సంఘం నాయకులు గాజుల జక్కయ్య, మేకర్తి కాశయ్య, మిట్ట తిరుపతి, గడ్డల శంకర్, అడప సతీష్, మనిగొండ వెంకటేష్, గడ్డల సురేష్, గణపతి, మిట్ట పోశం, రుకుం ప్రహ్లాద్, శంకర్, భీమేష్ తదితరులు ఉన్నారు.

## నవోదయ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

**- ఆగస్టు 10 వరకు దరఖాస్తులకు అవకాశం.. 11, 12 తేదీల్లో వివరాల సవరణ**

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరవ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆగస్టు 10లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు సమర్పించిన అభ్యర్థులకు ఆగస్టు 11, 12 తేదీల్లో దరఖాస్తులోని కొన్ని వివరాలను సవరించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. సవరణకు ఇచ్చిన సమయంలో పరీక్షా మాధ్యమం, లింగం, సామాజిక వర్గం, ప్రాంతం, వైకల్యం వంటి వివరాల్లో మాత్రమే మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల్లో మార్పులకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థులు తమ దరఖాస్తు వివరాలను పరిశీలించుకుని, పై పేర్కొన్న అంశాల్లో ఏవైనా సవరణలు అవసరమైతే నిర్ణీత తేదీల్లో సరిచేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మిషన్ భగీరథ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

అసిఫాబాద్ టౌన్, ఆగస్టు 7, ప్రభాతవార్త :

మిషన్ భగీరథ ఎల్ అండ్ టి, ఎవరెస్ట్ ఏజెన్సీల కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి, మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ కార్యాలయం వద్ద పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ కార్మిక ప్రతినిధులు ఈఈ రాకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వెంటనే సమస్యను పరిష్కరించకపోతే ఈ నెల 11న మిషన్ భగీరథ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చాపిడి బాలేష్‌తో పాటు యూనియన్ నాయకులు, ఎల్ అండ్ టి, ఎవరెస్ట్ ఏజెన్సీ కార్మికులు పాల్గొన్నారు.






## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- బీసీ స్టడీ సర్కిల్ సివిల్స్ ఫౌండేషన్ కోర్సుపై అవగాహన**

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ అందిస్తున్న వివిధ పోటీ పరీక్షల ఉచిత శిక్షణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్న సివిల్స్ ఫౌండేషన్ కోర్సు, ఇతర పోటీ పరీక్షల శిక్షణ వివరాలను విద్యార్థులకు తెలియజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ, టీజీపీఎస్సీ, పోలీస్, ఫారెస్ట్, బ్యాంకింగ్ తదితర ఉద్యోగాలకు ఉపయోగపడేలా ఫౌండేషన్ కోర్సు ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ అందించడంతో పాటు శిక్షణ కాలంలో విద్యార్థులకు ఉపకార వేతనం, స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామని చెప్పారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించిన శిక్షణకు అర్హులైన డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. బీసీ స్టడీ సర్కిల్ అందిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ.. బీసీ స్టడీ సర్కిల్ సహకారంతో కళాశాలలో తరచూ పోటీ పరీక్షలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు అవసరమైన కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.అనంతరం బీసీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డి. జనార్ధన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఇ. శారద, అధ్యాపకులు ఎం. రాజేశ్వర్, టి. దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లకు దరఖాస్తు చేసుకోండి

బెజ్జూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండలంలో కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ బిఎస్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వితంతు, ఒంటరి మహిళ, వికలాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, సికిల్ సెల్, తలసేమియా, డయాలసిస్ ఉన్నవారు గతంలో దరఖాస్తు చేసుకొని వారు, కొత్తగా పెన్షన్ కోసం ఈనెల 14వ తేదీలోపు సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వృద్ధాప్య పెన్షన్ దరఖాస్తులు ఇప్పుడు స్వీకరించడం లేదని ఇట్టి విషయాన్ని గమనించాలని సూచించారు.



## పిఆర్టియుటిఎస్ మండల శాఖ ఎన్నిక

బెజ్జూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండల కేంద్రంలో శుక్రవారం పిఆర్టియు టీఎస్ మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి చునార్కర్ అనిల్ కుమార్ తెలిపారు. అధ్యక్షులుగా ఆర్. తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఎం. సుభాష్, అసోసియేట్ అధ్యక్షులుగా రాజు, అనసూయ, ఉపాధ్యక్షులుగా సురేందర్, శంకరమ్మ, కార్యదర్శిగా రాజ్ కుమార్, సింధుజ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రావణ్, జిల్లా కార్యదర్శి సంతోష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## సింగరేణి ఏరియా అధికారులకు సన్మానం

తాండూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త :

బెల్లంపల్లి ఏరియా గోలేటి జిఎం కార్యాలయంలో శుక్రవారం ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా జిఎం శ్రీ రమేష్, ఏజీఎం వీరన్న, డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ జాదవ్ సంజీవ్ లను ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, ప్రతినిధులు శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ధరావత్ మంగీలాల్, కైరిగూడ మేనేజర్ శంకర్ వీరన్న, హరిసింగ్, కోటేశ్వరరావు, నరేష్, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, సౌందర్య, కల్పన, చిలుకు బాయ్, అనురాధ పద్మ, తదితరులు పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దు

**- ఎమ్మెల్యే ఇంటి ముందు మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన**

**- ఎన్నికల హామీ మేరకు నెలకు పది వేల రూపాయల వేతనం అమలు చేయాలని డిమాండ్**

**మంచిర్యాల, ఆగస్టు 7, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం మంచిర్యాలలో నిరసన చేపట్టారు. లక్ష్మీ టాకీస్ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే నివాసం వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్న కార్మికుల ఉపాధికి భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవద్దన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కార్మికుడికి నెలకు పది వేల రూపాయల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ప్రస్తుతం కొనసాగుతున్న విధానాన్నే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇంటి ముందట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



## 7వ అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

### గర్భిణీకి వైభవంగా శ్రీమంతం నిర్వహణ

**లక్షెట్టిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట పట్టణంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంగన్వాడి సూపర్వైజర్ మమత తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక గర్భిణీ స్త్రీకి అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి, పండ్లు, పోషకాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక కౌన్సిలర్లు శనివారపు చిన్నయ్య, చంద్రమౌళి, హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ... నవజాత శిశువులకు తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు (ముర్రుపాలు) పట్టించడం ఎంతో అవసరం అని పేర్కొన్నారు. తల్లిపాలు తాగడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని, అలాగే తల్లుల ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంటుందని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యత గుర్తించి, పిల్లల సమగ్ర వికాసానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత, కౌన్సిలర్లు శనివారపు చిన్నయ్య, చంద్రమౌళి, అంగన్వాడీ టీచర్స్ రాధిక, శంకరమ్మ, నీరజ, శంకరమ్మ ఆయా, గర్భిణులు, బాలింతలు, స్థానిక మహిళలు, చిన్న పిల్లలు పాల్గొన్నారు.


ఆలయంలో కొలువు దీరిన మైసమ్మ

## రేపే గాంధారి మైసమ్మ బోనాల జాతర

**క్యాతన్ పల్లి, ఆగస్టు 7,ప్రభాతవార్త**

ఆశాడ మాసంలో తెలంగాణ రాష్ట్ర పండుగ అయినా బోనాల జాతర రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరగనుంది. మంచిర్యాల మహా రాష్ట్ర ప్రధాన రహదారి బొక్కల గుట్ట వద్ద రేపు గాంధారి మైసమ్మ బోనాల జాతర నిర్వహణకు సర్వం సిద్ధం అయింది.ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి టి.ఎం సత్య నారాయణ లు మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్లను ఏర్పాటు చేశారు. గాందారి చిల్డ్రన్స్ పార్క్ సమీపం నుంచి సుమారు డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలతో అంగ రంగ వైభవంగా బోనాలు తీసుకు వస్తారని అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్య లేకుండా జాతరలో గట్టి పోలీసు నిఘా ఉంటుందని అన్నారు. మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక బోనం మొక్కుల తో పాటు, జంతు బలులు, ఎత్తు బంగారాలతో భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.

## ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి తరలిరావాలి

**కెరమెరి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**

ఈనెల 9న కెరమెరి మండల కేంద్రంలోని కుంరం భీం ఆదివాసీ భవన్లో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ఆదివాసీ గ్రామాల నుండి ప్రతి ఒక్కరు తరలిరావాలని రాజ్ గోండ్ సేవా సమితి రాయ్ సెంటర్, ఆదివాసీ తుడుం దెబ్బ, ఆదివాసీ సర్పంచుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదివాసీ భవన్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ, రూట్ మ్యాప్ గురించి చర్చించారు. ఉదయం 10:30 గంటలకు సాకడ చౌరస్తా నుండి ఆదివాసీ సంస్కృృతి సంప్రదాయా వాయిద్యాలతో ఆదివాసీ భవన్ వరకు ర్యాలీగా చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కుమురం భీం విగ్రహానికి నివాళులు, జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. తదనంతరం సాంస్కృృతిక కార్యక్రమాలు, ముఖ్య అతిథుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రాజ్ గోండ్ సేవా సమితి అధ్యక్షులు పెందోర్ మోతిరాం, తుడుం దెబ్బ అధ్యక్షులు కుడ్మేత సోము, సార్మేడి జంగు, సర్పంచులు పెందోర్ ఆనందరావు, కుంరం అంబరావు, కుడ్మేత కొద్దు, తుంరం లచ్చు, ఆత్రం అన్నిగా, బుచ్చయ్య, నాయకులు కుర్సంగా దందు, ఆత్రం కుసుంరావు, కుంరం నాణేశ్వర్, మడవి భరత్, సిడం ధర్ము, కుంరం గుణవంతరావు, తొడసం జగన్నాథ్, ఆత్రం చందన్, మడవి సీతారాం, మడవి తుకారాం, మడవి రాజు, తదితరులు ఉన్నారు.



## గ్రీన్‌వుడ్ పాఠశాలలో బోనాల శోభ

**- పోతురాజు వేషధారణలో విద్యార్థులు**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 07, ప్రభాతవార్త**

మంచిర్యాల మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గల గ్రీన్‌వుడ్ పాఠశాలలో శుక్రవారం రోజున బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాలనే లక్ష్యంతో పాఠశాల యాజమాన్యం ఈ వేడుకలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, రంగురంగుల అలంకరణలు, సంప్రదాయ వాతావరణం పాఠశాల ఆవరణకు పండుగ శోభను తీసుకువచ్చాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బోనం ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పోతురాజు వేషధారణలో చిన్నారుల ఉత్సాహం అందరినీ అలరించింది. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ భరద్వాజ్ నాయుడు, నిర్వాహక అధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు సంస్కృృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం కూడా విద్యాసంస్థల బాధ్యతేనని పేర్కొన్నారు. తెలంగాణ పండుగల విశిష్టతను చిన్నారులకు పరిచయం చేయడం ద్వారా వారిలో సాంస్కృృతిక విలువలు పెంపొందుతాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, సాంస్కృృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జానపద నృత్యాలు, సాంప్రదాయ గీతాలు, సాంస్కృృతిక ప్రదర్శనలు సభికులను ఆకట్టుకుని చప్పట్ల వర్షం కురిపించాయి. తెలంగాణ పల్లె సంస్కృృతిని ప్రతిబింబించే అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ఆత్మవిశ్వాసం, కళాప్రతిభను చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల సమన్వయం కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా సాగిన ఈ బోనాల వేడుకలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. పండుగల ద్వారా సంస్కృతిని పరిరక్షించాలనే సందేశాన్ని విద్యార్థులు చక్కగా చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మిస్ట్రెస్ క్రిస్టినా, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, పరిపాలనాధికారి ఖుద్దూస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పార్ట్ టైం స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

**- పార్ట్ టైం స్వీపర్ల యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చెరుకుపల్లి స్వామి**

**తాండూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త :**



రాష్ట్రంలోని గ్రంథాలయాలలో పని చేస్తున్న పార్ట్ టైం స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పార్ట్ టైం స్వీపర్ల యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చెరుకుపల్లి స్వామి కోరారు. మంచిర్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అర్జున్ కు శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో పార్ట్ టైం స్వీపర్స్ వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చెరుకుపల్లి స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రంథాలయాలలో చాలీచాలని వేతనాలతో పార్ట్ టైం స్వీపర్లుగా పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు కూడా ప్రతి నెల సక్రమంగా రావడం లేదన్నారు. పెరిగిన నిత్యవసర సరుకులకు అనుగుణంగా తమ వేతనాలను పెంచాలని, ప్రతినెల వేతనాలు సక్రమంగా చెల్లించాలని కోరారు. తమ వేతనాల పెంపు, ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పార్ట్ టైం స్వీపర్లు సాయికృష్ణ, సుజాత, సత్యనారాయణ, రామస్వామి, మధుకర్ పాల్గొన్నారు.

# ఎస్పీఎం గేటు వద్ద ఆగని కార్మికుల పోరుబాట

**- 80వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు.. - గుర్తింపు సంఘాల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి**

**- యాజమాన్యం మొండి వైఖరి వీడాలి: విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్త సత్యనారాయణ**

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :




సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం) గేటు ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 80వ రోజుకు చేరుకున్నాయి. గుర్తింపు సంఘాల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు కొనసాగిస్తున్న దీక్షలకు శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్త సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం మొండి వైఖరి వీడి కార్మికుల న్యాయమైన హక్కులను గౌరవించాలని కోరారు. సిర్పూర్ పేపర్ మిల్లులో గతంలో దశాబ్దాలుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించిన చరిత్ర ఉందన్నారు. అయితే 2018లో కంపెనీ పునఃప్రారంభమైన తర్వాత దాదాపు ఎనిమిదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కార్మికులు తమ సమస్యలను అధికారికంగా ప్రాతినిధ్యం వహించే సంఘాన్ని ఎన్నుకునే అవకాశం కోల్పోయారని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు, కార్మిక శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. రిలే నిరాహార దీక్షలకు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు చిలక సత్యనారాయణ, కోటేశ్వరరావు, కె. నాగేశ్వరరావు, కలికోట రమణయ్య, ముంజం ఆనంద్ సంఘీభావం తెలిపారు. జేఏసీ నాయకులు గోగర్ల రాములు, గోలేం వెంకటేశం, శీలం రాజమౌళి, కుషణ రాజన్న, షబ్బీర్ పాషా, కల్లూరు శ్రీనివాస్, చిట్టవేణి రాజేష్ యాదవ్, అబ్దుల్ నబీ, నస్పూర్ శ్రీనివాస్, కనకచారి తదితరులు పాల్గొన్నారు. రిలే నిరాహార దీక్షల్లో భాగంగా 80వ రోజు ఏ. శంకరయ్య, శైలన్ హల్దర్, అశ్విని కుమార్ సింగ్ దీక్షలో కూర్చున్నారు. గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10న ధర్నా: జేఏసీ

**- 12వ వేజ్ బోర్డ్ ఏర్పాటులో ఆలస్యంపై జాతీయ కార్మిక సంఘాల మండిపాటు**

**- ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు**

నస్పూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10న సింగరేణి జీఎం కార్యాలయాల ముందు తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పేరం రమేష్, సీఐటీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి మాట్లాడారు. 12వ వేజ్ బోర్డ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన లేబర్ కోడ్ల ప్రకారం గుర్తింపు సంఘం ఎన్నికల్లో 51 శాతం ఓట్లు వచ్చిన సంఘానికే గుర్తింపు హోదా లభిస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఒక్క సంఘానికి అంత ఓటింగ్ వచ్చే అవకాశం లేదని నాయకులు స్పష్టం చేశారు. కార్మిక సంఘాల ఉనికిని ప్రశ్నార్థకం చేసేందుకే ఈ నిబంధన తెచ్చారని ఆరోపించారు. 51 శాతం ఓట్లు రాకపోతే ప్రభుత్వమే అధికారులతో కమిటీ వేసి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, విద్యార్థుల పోరాటాల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ తీరుపై కార్మికులు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లాభాల్లో ఉన్న ఎల్ఐసీలో ఆరు శాతం వాటాను ఉపసంహరించుకోవడం దుర్మార్గమైన చర్య అని నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలు లేకపోతే నిత్యావసరాల ధరలు పెరిగి, ప్రైవేటు శక్తులు ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వీరభద్రం, ఎస్ కె బాజీ సైదా, అడ్డు శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు గరిగస్వామి, బాపు, వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు వెంగళ శ్రీనివాస్, సుధాకర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలను ఆదరిద్దాం..

**- నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుదాం - జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 07, ప్రభాతవార్త



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ధరించడం ద్వారా నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలని జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం రోజున ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా చేరాల వంశీ మాట్లాడుతూ 1905 ఆగస్టు 7న ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం దేశ ప్రజల్లో స్వదేశీ ఉత్పత్తుల వినియోగానికి బాటలు వేసిందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో భారత ప్రభుత్వం 2015 నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక వారసత్వానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. లక్షలాది మంది నేత కార్మికుల కుటుంబాలు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, అయితే ప్రస్తుతం పెరుగుతున్న యాంత్రిక వస్త్రాల వినియోగం, మార్కెట్ సమస్యలు, ముడి పదార్థాల ధరల పెరుగుదల వంటి కారణాలతో చేనేత రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం అందిస్తూ నేత కార్మికులకు ఉపాధి భద్రత, మార్కెటింగ్ సౌకర్యాలు, రుణ సదుపాయాలు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక సందర్భాల్లో చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని సూచించారు. యువత కూడా చేనేత వస్త్రాలను ఫ్యాషన్‌గా స్వీకరించి, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఏడాదికి కనీసం కొన్ని చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా నేతన్నల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించవచ్చని పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా "చేనేతను ఆదరిద్దాం – నేతన్నను కాపాడుకుందాం" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని చేరాల వంశీ విజ్ఞప్తి చేశారు.



## పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సామల సదాశివ వర్ధంతి

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలందించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సామల సదాశివ వర్ధంతిని కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పద్మశాలి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా సామల సదాశివ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుల్లపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వద్దాల వెంకట నరసయ్య, గౌరవ అధ్యక్షుడు సింధం చంద్రయ్య మాట్లాడుతూ.. సామల సదాశివ తెలంగాణ సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సామల సదాశివ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే తెలుగు, ఉర్దూ, మరాఠీ, హిందీ భాషలపై విశేష పాండిత్యాన్ని సంపాదించారని తెలిపారు. భాషలు, సాహిత్యం, సంగీతం, సంస్కృతిపై అనేక విలువైన గ్రంథాలను రచించి తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. ఆయన సాహిత్య సేవలకు గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో పాటు పలు గౌరవాలు లభించాయని తెలిపారు. సామల సదాశివ రచనలు సరళమైన భాష, లోతైన భావాలతో పాఠకులను ఆలోచింపజేస్తూ సమాజంలో చైతన్యాన్ని నింపాయని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థుల పట్ల అపారమైన ప్రేమ, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యాబోధన ఆయన ప్రత్యేకత అని గుర్తుచేశారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని, ఆయన సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ భోగ వెంకటేశం, కోశాధికారి కొక్కుల మురళి, గాదె వెంకటయ్య, మాచర్ల శ్రీనివాస్, దండే భీమయ్య, అల్లె గురువయ్య, ములుకుట్ల సత్యనారాయణ, చిక్క తరుణ్, గడదాసు మల్లయ్య, బూర నరసింహ, నూతి సుదర్శన్, వంగరి మొగిలి, అవధూత బాపూజీ, గడదాసు శంకరయ్య, నలిగొండ మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్**

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించనున్న దేశవ్యాప్త జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం సీతానగర్ (బొగడగూడ)లో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలను కలిసి కార్యక్రమానికి మద్దతు కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.600 కనీస కూలి చెల్లించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజుల పని కల్పించి, చట్టబద్ధమైన కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు, నూతన విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుర్కుట్ రాజేందర్, ఎం. కుమార్, కమల మోల్కర్, భాగ్య, గీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.






## గ్రామాల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పని చేయాలి

**- మండల సర్వస గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్**

**- పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సర్పంచులు**

**కెరమెరి, ఆగస్టు 7,ప్రభాతవార్త:**

గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి వెంకట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల ప్రజాపరిషత్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల క్షేత్రస్థాయిలో అమలు తీరును అధికారులు పరిశీలించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభా దృష్టికి తీసుకెళ్లేందుకు గతంలో మూడు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తూ ఉండేవారని తెలిపారు. కానీ మండల పరిషత్ పాలకవర్గ పదవి కాలం రెండేళ్ల క్రితమే ముగియడంతో సమావేశాలు సైతం నిలిచిపోయాయి. నూతన సర్పంచుల ఎన్నికలు జరిగినప్పటికీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సరైన వేదిక లేకపోవడంతో ఇబ్బందులు పడేవారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతి 45 రోజులకు ఒకసారి మండల పరిషత్ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు చేయడం శుభ పరిణామం అన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల వివరాలను గ్రామస్థాయి అధికారులు స్థానిక సర్పంచులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళా సమైక్య ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు రుణాల వివరాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సర్పంచులకు అందజేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలకం కావడంతో అధికారులు సర్పంచులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ఎంపీడీవో అంజత్ పాషా, తహసీల్దార్ నాగార్జున,ఎంపీఓ సాయి గౌడ్, ఐకెపి ఎపిఎం ముక్తేశ్వర్, సర్పంచులు ఆత్రం లక్ష్మణ్ రావు, భీంరావు, పెందూర్ ఆనంద్ రావు, రాదబాయి, విజయలక్ష్మీ,నాగ్ నాథ్ తదితరులు పాల్గోన్నారు.

## థాయ్‌లాండ్‌లో తెలంగాణ క్రీడాకారుల ప్రతిభ

**మూడు పతకాలతో స్వదేశానికి - బెల్లంపల్లిలో ఘన స్వాగతం**

**బెల్లంపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త**



అంతర్జాతీయ వేదికపై తెలంగాణ క్రీడాకారులు మరోసారి తమ ప్రతిభను నిరూపించారు. థాయ్ లాండ్‌లోని పటాయా నగరంలో జూలై 31 నుండి ఆగస్టు 4 వరకు వరల్డ్ టైక్వాండో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ హీరోస్ ఇంటర్నేషనల్ టైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు తరఫున పోటీపడిన తెలంగాణ క్రీడాకారులు మూడు పతకాలు సాధించి రాష్ట్రానికి గౌరవం తీసుకొచ్చారు. ఈ పోటీలలో ప్రమోద్ కుమార్ ప్రధాన్ సిల్వర్ మెడల్ సాధించగా, లాస్య దలాయ్ మరియు గోగర్ల శ్రీనిత్ సాయి బ్రాంజ్ మెడల్స్‌ను గెలుచుకున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ మాస్టర్ జిల్లపల్లి వెంకటస్వామి వెల్లడించారు. క్రీడాకారుల ఈ విజయాలు రాష్ట్ర క్రీడా రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. విజేతలకు శిక్షణ అందించిన కోచ్ జంగపల్లి అజయ్‌ను తెలంగాణ రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మూట శ్రీనివాస్, కార్యదర్శి కురువ శ్రీహరి, ఖజాంచి సంతోష్ అభినందించారు. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బుచ్చి రామారావు, కార్యదర్శి జిల్లపల్లి వెంకటస్వామి, ఖజాంచి సుధాకర్ కూడా క్రీడాకారులను మరియు కోచ్‌ను ప్రశంసించారు. పతకాలతో స్వదేశానికి తిరిగి వచ్చిన క్రీడాకారులకు బెల్లంపల్లిలో ఘన స్వాగతం లభించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో భాజాభజంత్రీలు, బాణసంచా మధ్య భారీ విజయోత్సవ ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణంలో క్రీడాకారులను సన్మానిస్తూ ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాభిమానులు, శిక్షకులు, అసోసియేషన్ ప్రతినిధులు విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త :**



ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఇందుకు గాను అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య లతో కలిసి జిల్లా అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే పోలీస్ గౌరవ వందనం, పతాకావిష్కరణ, వేదిక అలంకరణ, పోడియం, వాహనాలను పూలతో అలంకరించడం, షామియాన, శకటాలు, సౌండ్ సిస్టం, ప్రసంగ ప్రతి, ప్రముఖుల సిట్టింగ్ నిర్వహణ, ఫోటో వీడియోగ్రఫీ, మీడియా గ్యాలరీ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాల కొరకు చక్కటి ప్రతిభ కనపరిచే ఉద్యోగులను ప్రతి శాఖ నుండి ఒకరు, ఇద్దరి జాబితాను ఈనెల 12వ తేదీ లోగా అందించాలని తెలిపారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉండాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్రంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టాలి

**- కృష్ణ కాలనీలో ప్రారంభమైన ప్రజా పోరు యాత్ర రెండవ రోజు**

**- సెప్టెంబర్ 1న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని వాసిరెడ్డి సీతారామయ్య పిలుపు**

**నస్పూర్, ఆగస్టు 7, ప్రభాతవార్త**



కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఆగస్టు 6 నుండి 14 వరకు నిర్వహిస్తున్న ప్రజా పోరు యాత్ర రెండవ రోజు కార్యక్రమాన్ని కృష్ణ కాలనీ ఏఐటీయూసీ కార్యాలయం వద్ద శుక్రవారం పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర ధరలు పెరిగి సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించకుండా మోసం చేస్తోందని సీతారామయ్య ఆరోపించారు. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చి పెద్ద వ్యాపారవేత్తలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు, యువకుల పట్ల అలసత్వం వహిస్తూ దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు. ఈ సమస్యలపై ప్రజలను చైతన్యపరిచేందుకు సిపిఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజా పోరు యాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కే వీరభద్రయ్య, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు ఎస్ కే బాజీ సైదా, మిర్యాల రాజేశ్వర రావు, కొత్తపల్లి మహేష్, మొగిలి లక్ష్మణ్, దేవి పోచన్న, బాలసాని లక్మణ్, దుర్గయ్య, కొమ్ము రవి, గడప రవి పాల్గొన్నారు.

# మాలి హక్కుల సాధనకు ఐక్య పోరాటం

**- జంతర్‌మంతర్ మహాధర్నాను విజయవంతం చేయాలి - మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు**

**- సిర్పూర్‌లో తెలంగాణ మాలి సంక్షేమ సంఘం సన్నాహక సమావేశం**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త**



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తెలంగాణ మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదే వసంతరావు పిలుపునిచ్చారు. మహాధర్నా కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం సిర్పూర్ పట్టణంలోని తిలక్‌నగర్‌లో తెలంగాణ మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురి శ్యాంరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదే వసంతరావు మాట్లాడుతూ.. మాలి కులానికి ఎస్టీ హోదా సాధించాలనే డిమాండ్‌తో గత 30 ఏళ్లుగా నిరంతర ఉద్యమం కొనసాగుతోందని తెలిపారు. మాలి సమాజ హక్కుల సాధన కోసం చేపడుతున్న ఉద్యమంలో భాగంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న మహాధర్నా కీలక ఘట్టంగా నిలవనుందని పేర్కొన్నారు.

### ఐక్యంగా ఉద్యమించాలి..

మాలి కులస్థుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. మహాధర్నాకు మాలి కులస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమ కార్యాచరణ, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, మహాధర్నా ఏర్పాట్లపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అదే నాందేవు, జిల్లా ప్రధాన కార్యదర్శి నీకోడె గంగారాం, మండల అధ్యక్షుడు గురుండ్ల నానాజీ, మండల ప్రధాన కార్యదర్శి వడై రవి, పరమేశ్వర్, శంకర్, సంఘ నాయకులు, యువకులు, పలువురు మాలి కులస్థులు పాల్గొన్నారు.

# ఆదివాసీ వారోత్సవాల ముగింపు సభను జయప్రదం చేద్దాం

- దసలి రైతులపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యాన్ని కండిస్తున్నాం
- ఆదివాసీల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలి
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్

చెన్నూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త



ఈ నెల 9వ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాగాల రాజన్న ఎర్మ పున్నం తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో శుక్రవారం రోజున ఆదివాసి జిల్లా నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాగాల రాజన్న ఎర్మ పున్నం మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలు ముగింపు సభను చెన్నూరు పట్టణ కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దసలి రైతులపై అటవీశాఖ అధికారులు దౌర్జన్యం చేస్తుంటే ఈ నియోజకవర్గంలో ఉన్న మంత్రి వివేక్ కి ఎందుకు కనపడటం లేదని ప్రశ్నించారు. తరతరాలుగా ఆధారపడి జీవిస్తున్న దసలీ, పోడు రైతుల పై అటవీ అధికారులు దౌర్జన్యాలకు పాల్పడుతు అక్రమ కేసులు పెడుతున్నారని అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఏనాడు కూడా పట్టించుకోకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధి కోసం గ్రామాలకు రోడ్డు కరెంటు విద్యా వైద్యం కోసం నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. భవిష్యత్తులో ఆదివాసీ హక్కుల సాధన, సంస్కృుృతి కాపాడుకోవడానికి కొమరం భీం పోరాట స్ఫూర్తి తో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై యుద్ధం చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మడే గణేష్, కోర్తే సమ్మయ్య, కొండపల్లి వెంకటి, తలండి మల్లేష్ లు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం కమిషనర్ల నియామకానికి కలెక్టర్‌కు వినతి

- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలకు 33 మంది గౌరవ కమిషనర్ల నియామకం చేయాలని విజ్ఞప్తి

మంచిర్యాల, ఆగస్టు7, ప్రభాతవార్త




సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలకు 33 మంది గౌరవ కమిషనర్లను నియమించాలని కోరుతూ శుక్రవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సూరస్రవతి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం సమర్పణ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, జాతీయ సహాయ కార్యదర్శులు వంగల వివేకానంద, మార్క నవీన్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర సహ సమన్వయకర్త గడప కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాష్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి దూడెం శ్రీనివాస్, డి. విజయభాస్కర్, అలిశెట్టి నర్సయ్య, రాథోడ్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు సమాచార హక్కు చట్టం మరింత సమర్థవంతంగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# అంతరిక్ష రంగంలో భాసించిన ఆర్జీయూకేటీ బాసర పూర్వ విద్యార్థిని అనూహ్య

## విక్రమ్I ప్రయోగంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ కిరణం

భైంసా, ఆగస్టు 07, ప్రభాతవార్త:



భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ లాంచ్ వెహికల్ "విక్రమ్1" (మిషన్ ఆగమనం) విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన చారిత్రాత్మక ఘట్టంలో ఆర్జీయూకేటీ బాసర పూర్వ విద్యార్థిని అలుగోజు అనూహ్య విశేష ప్రతిభ కనబరిచారు. ప్రముఖ స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థలో ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె, ఈ ప్రతిష్టాత్మక ప్రయోగానికి అవసరమైన కీలక సాంకేతిక అనుసంధాన వ్యవస్థల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించి విశ్వవిద్యాలయంతో పాటు రాష్ట్రానికి పేరు తెచ్చారు. కరీంనగర్‌లో ప్రాథమిక విద్యనభ్యసించి, 2018–2024 మధ్య కాలంలో ఆర్జీయూకేటీ బాసరాలో బీటెక్ పూర్తి చేసిన అనూహ్య ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆమె తల్లి అలుగోజు లతాశ్రీ, ఒంటరి మహిళగా వ్యవసాయ పనులు చేస్తూ కష్టపడి పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. ఇదే విశ్వవిద్యాలయానికి చెందిన అనూహ్య సోదరుడు అలుగోజు ఆదిత్య కూడా ఎస్టీఈఎమ్ విద్య, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు రంగాల్లో శిక్షణనిస్తూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతున్నారు. అనూహ్య సాధించిన విజయంపై ఆర్జీయూకేటీ బాసర వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడమే తమ విశ్వవిద్యాలయ లక్ష్యమని, అనూహ్య విజయం వేలాది మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే విశ్వవిద్యాలయ ఓఎస్డీ ప్రొఫెసర్ ఇ. మురళీదర్శన్, అసోసియేట్ డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అనూహ్యకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ఖర్జీ పెండెల్ ధారి రోడ్డుకు అటవీ అనుమతులు ఇప్పించాలి

## కోదండరెడ్డికి వినతిపత్రం అందజేసిన అట్ల పోతారెడ్డి

సారంగాపూర్, ఆగస్టు 07, ప్రభాతవార్త:



మండలంలోని కౌట్ల (బి) శివారులోని ఖర్జీ పెండెల్ ధారి రోడ్డుకు అటవీ అనుమతులు ఇప్పించాలని, పామాయిల్ రైతుల విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కిసాన్ సెల్ నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అట్ల పోతారెడ్డి కోరారు. ఉట్నూర్‌లోని కొమరం భీమ్ కాంప్లెక్స్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విచారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ఆదివాసీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అట్ల పోతారెడ్డితో పాటు ఎన్ఆర్ఐ కమిటీ రాష్ట్ర సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల, పెండెల్ ధారి మాజీ సర్పంచ్ సిడం గంగారం, ఉట్నూర్ కాంగ్రెస్ నాయకులు భూమన్న, రైతు స్వరాజ్య వేదిక ఉమ్మడి జిల్లా నాయకులు సంగెపు బొర్రన్నల నేతృత్వంలో కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అటవీ అనుమతులు లేక రహదారి పనులు నిలిచిపోవడంతో స్థానిక ఆదివాసీలు, రైతులు తీవ్ర రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే అటవీ అనుమతులు ఇప్పించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పామాయిల్ సాగు చేస్తున్న రైతులకు సరిపడా లోడ్‌తో విద్యుత్ సరఫరా కాకపోవడం వల్ల నష్టం వాటిల్లుతోందని, త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ విజ్ఞప్తులపై చైర్మన్ కోదండ రెడ్డి స్పందిస్తూ.. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# నిర్మల్ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- అధికారులతో అదనపు కలెక్టర్ల సమీక్ష

నిర్మల్, ఆగస్టు 07, ప్రభాతవార్త:



జిల్లా కేంద్రంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంద్రాగస్టు వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రోటోకాల్ ప్రకారం అతిథులను ఆహ్వానించాలని, ప్రధాన వేదికను ఆకర్షణీయంగా అలంకరించాలని సూచించారు. దేశభక్తిని ఉట్టిపడేలా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు నిరంతర విద్యుత్, టెంట్, షామియానా, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, పటిష్ట పోలీసు బందోబస్తుతో పాటు అంబులెన్స్, వైద్య శిబిరం అందుబాటులో ఉంచాలని తెలిపారు. పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి లోపాలు లేకుండా వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్లు పిలుపునిచ్చారు. సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్‌ఓ రాథోడ్ రమేష్, డిఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారంలో వాటా కోసం చేనేత కార్మికులు ఏకం కావాలి

- జాతీయ చేనేత దినోత్సవంలో గజెల్లి వెంకటయ్య పిలుపు
- చేనేత సమస్యల పరిష్కారానికి సామాజిక న్యాయ పోరాటమే మార్గమని వ్యాఖ్య

మంచిర్యాల, ఆగస్టు7, ప్రభాతవార్త



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చేనేత రంగంలో ప్రతిభ కనబరిచిన నేత కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా చేనేత కార్మికుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆగాలంటే, సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే పద్మశాలీయులు రాజకీయాలకు అతీతంగా ఏకమై రాజ్యాధికారంలో తమ వాటా సాధించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్, శాసనసభ, మంత్రివర్గం, వివిధ సంస్థల్లో సముచిత ప్రాతినిధ్యం కోసం పోరాటాలు కొనసాగించాలని, సామాజిక న్యాయం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో కలిసి ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ మొగిలి, సాగర్, కృష్ణమూర్తి, రాజలింగు, మల్లయ్య, రాజమౌళి, లచ్చయ్య, నారాయణ, చిందం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.